## క్లుప్తంగా...

### బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

గౌలిపురా: శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భారతమాత ఆలయం, కోట మైసమ్మ ఆలయంలో ఈ నెల 27న రాత్రి 9 గంటలకు మాతా విశాల్ జాగరణ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఆదివారం మాతా విశాల్ జాగరణ్ బ్రోచర్‌ను విడుదల చేశారు. అనూప్ కుమార్ భజన మండలి ఆధ్వర్యంలో జాగరణ్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శులు అల్లి మధుసూదన్ గిరి, ఇటిక్యాల సుమన్ కుమార్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు మామిడి కృష్ణ, బి.వై.శ్రీకాంత్, కోశాధికారి బొడ్డు సాయిబాబా, వై.రాజు, డల్లు శివ, ఎం.వినోద్, మహేందర్ గిరి, ఎం.విక్రమ్, శ్రీకాంత్, మురళీ, మహేశ్, దత్తు పాల్గొన్నారు.

### పూర్వ విద్యార్థినులకు సన్మానం



పూర్వ విద్యార్థినులను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తమ విద్యా సంస్థల్లో చదివిన వారు నేడు రాష్ట్రంలోనే కాకుండా దేశంలోని వివిధ సంస్థల్లో అత్యున్నత పదవుల్లో ఉన్నారని మెహిదీపట్నం సంతోష్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ అల్లం విజయ రాణి అన్నారు. సెయింట్ ఆన్స్ కళాశాలలో జరుగుతున్న పూర్వ విద్యార్థినుల సమ్మేళనంలో ఆదివారం అత్యున్నత పదవుల్లో ఉన్న పూర్వ విద్యార్థులను సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..అత్యున్నత విద్యా ప్రమాణాలతో విద్యను అందిస్తున్నామని..అందువల్లే తమ కళాశాల నెంబర్ వన్ కళాశాలల్లో ఒకటిగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ మరియారాణి, డాక్టర్ శ్రీకళ, డాక్టర్ ఉషశ్రీ తదితరులున్నారు.

### పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో ఏనుగు నర్సింహారెడ్డి

గన్‌ఫౌండ్రీ: తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలలో ఉంచుతున్న ఈ రోజుల్లో తల్లిదండ్రుల పేరుట 100 ఏళ్ల వేడుకలను నిర్వహించడం అభినందనీయమని ఏనుగు నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీదత్త సాంస్కృతిక సంస్థ 15వ వార్షికోత్స వేడుకలు, కామరాజు గద్ద బాబురావు శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత మద్దాలి రఘురామ్, దూరదర్శన్ విశ్రాంత అధికారి అనంత పద్మనాభరావుకు కామరాజు గద్ద బాబురావు, గిరిజ సీతారామమ్మ పురస్కారాలను ప్రదానం చేశారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ విశ్రాంత అడిషనల్ కమిషనర్ ఎన్.అజయ్, సంస్థ అధ్యక్షులు కె.రమణ, ప్రధాన కార్యదర్శి వాసవదత్త రమణ పాల్గొన్నారు.

### నేడు ఉచిత వైద్య శిబిరం

విజయనగర్‌కాలనీ: విజయనగర్‌కాలనీలోని అఫ్జల్‌సాగర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేడు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మెగా ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి డాక్టర్ ప్రియాంక ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, జనరల్ ఫిజిషియన్, ఆప్తమాలజీ, డెంటల్‌తో పాటు సాధారణ రోగాలకు ఉచిత వైద్య చికిత్సలు ఉంటాయని తెలిపారు.

# నాలాలు ఇలా.. పట్టించుకోరా..?

- వరుసగా కురుస్తున్న వర్షాలకు పొంగిపొర్లుతున్న నాలాలు
- ఫెన్సింగ్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారిన వైనం
- భయాందోళనలో స్థానికులు

గోల్కొండ: వరుసగా కురుస్తున్న వర్షాలకు నాలాలు పొంగిపొర్లుతున్నాయి. వర్షపు నీరు ఉధృతికి బుల్కాపూర్ నాలా, నయాకీలా నాలా పొంగిపొర్లుతూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తుంది. నాలాలో కొట్టుకు వస్తున్న వ్యర్థాలు దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయి. గోల్కొండ నయాకీలాలోని నాలా అహ్మద్ కాలనీ, బగ్దాద్ కాలనీల గుండా ప్రవహిస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురి చేస్తుంది. పలుచోట్ల ఈ నాలాకు ఫెన్సింగ్ లేకపోవడంతో వరద నీరు ఇళ్లల్లోకి చొచ్చుకొని వస్తుంది. గతేడాదే బగ్దాద్ కాలనీలో నాలాకు ఉన్న ఫెన్సింగ్‌లో విద్యుత్ ప్రవహించి ప్రమాదవశాత్తు ఓ యువకుడు మృతి చెందాడు. అయినా అధికారులు స్పందించకుండా నాలాలకు గట్టి ఫెన్సింగ్ వేయడం లేదు.

#### ఎటు చూసినా వ్యర్థాలే..

షేక్‌పేట్ నుంచి టోలిచౌకీ బస్తీలు, కాలనీల మీదుగా అహ్మద్‌నగర్ వైపు వెళ్తున్న ఈ నాలాలో ఎటు చూసినా వ్యర్థాల కుప్పలు తెప్పలు కనిపిస్తున్నాయి. గత వారం షేక్‌పేట్‌లో పర్యటించి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నాలాలోని వ్యర్థాలను పరిశీలించారు. నాలాలో



మొగల్‌కా నాలా మెయిన్ రోడ్డు వద్ద రోడ్డుపై వర్షానికి పడిన భారీ గుంత

పూడికలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయినా అధికారుల్లో చలనం రాలేదు. ఇదిలా ఉండగా అహ్మద్‌నగర్‌లోని బుల్కాపూర్ నాలా సైతం మూగ జంతువుల పాలిట మృత్యుకుహరంగా మారింది. నాలాకు ఫెన్సింగ్ ధ్వంసమై దశాబ్దాలు గడుస్తున్నా ఫెన్సింగ్ వేయడం లేదు.



పొంగిపొర్లుతున్న నయాకీలా నాలా

#### రోడ్లపై భారీ గుంతలు...

అభివృద్ధి పనుల పేరిట ప్రధాన రోడ్లను ఆనుకొని భారీ గుంతలను తవ్వారు. పనులు పూర్తయినా ఆ గుంతలను పూడ్చలేదు. దీంతో వరద నీరు రోడ్డుపై నిలిచి ఉన్నప్పుడు ఎక్కడ ఏ గుంత ఉందో తెలియక ద్విచక్ర వాహనాదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. రింగ్ రోడ్డు మొగల్‌కా నాలా వద్ద ఉన్న ఓ భారీ గుంత ప్రమాద గంటికలను మోగిస్తుంది. ఆటోలు, ద్విచక్ర వాహనాలు ప్రతినిత్యం ఈ గుంత ప్రమాదాలకు కేర్ ఆఫ్ అడ్రస్‌గా నిలుస్తుంది. టోలిచౌకీ మెయిన్ రోడ్డు, గుడిమల్కాపూర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో మూతలు లేని మ్యాన్‌హోళ్లు లెక్కకు మించి ఉన్నాయి. బల్దియా, జలమండలి అధికారులు ప్రత్యేక మాన్సూన్ టీమ్‌లు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారు. అయితే ప్రమాదాలు జరిగే సమయంలో మాత్రం ఈ బృందాల జాడ కానరాదు.

## సంక్షేమ పథకాలతోనే బీజేపీకి ఆదరణ

అబిడ్స్: ప్రధాని నరేంద్రమోదీ సంక్షేమ పథకాలతోనే తెలంగాణతో పాటు దేశ నలుమూలలా బీజేపీకి విశేష ఆదరణ లభిస్తుందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం కట్టెల మండిలోని బీజేపీ కార్యాలయంలో గోషామహల్ నియోజకవర్గానికి చెందిన సత్య సుందరం హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఠాకూర్ గోపాల్ సింగ్ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సత్కరించి దేవీ నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా సీతారాంబాగ్‌లో జరిగే అమ్మవారి వేడుకలకు రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్‌రావు మాట్లాడుతూ..ఢిల్లీ, హైదరాబాద్ యూనివర్సిటీల్లో ఏబీవీపీ విజయం సాధించడం ఎంతో గర్వించదగ్గ విషయమన్నారు. ప్రతి యూనివర్సిటీలో విద్యార్థులంతా ప్రధాని మోదీ ప్రభుత్వ ప్రగతి, సంక్షేమానికి ఆకర్షితులై బీజేపీ, ఏబీవీపీ వైపే మొగ్గు చూపుతున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ అగ్ర నాయకులు హైదరాబాద్ యూనివర్సిటీలలో చేసిన చిల్లర రాజకీయాలను నేడు విద్యార్థులంతా ఏబీవీపీని గెలిపించి కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వీహెచ్‌పీ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావును సత్కరించిన ఠాకూర్ గోపాల్‌సింగ్ తదితరులు

## ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు



మాట్లాడుతున్న లింగం శ్రీధర్‌జీ

అబిడ్స్: శక్తిలేని వ్యక్తి శవంతో సమానమని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) తెలంగాణ రాష్ట్ర ప్రచారక్ లింగం శ్రీధర్‌జీ అన్నారు. శక్తితో పాటు సంస్కారం, సమర్పణ, సేవాభావం కలిగి ఉండాలన్నారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను సీతారాంబాగ్‌లోని శ్రీ జగన్నాథ మఠంలో శ్రీధర్‌జీ ఆదివారం ప్రారంభించారు. దసరా నాటికి జంట నగరాల్లోని 1000 ప్రాంతాల్లో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలను నిర్వహించి, సంఘం సిద్ధాంతాలను గడప గడపకూ తీసుకువెళ్తామని ఆయన ప్రకటించారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వాడకాన్ని మానుకోవాలన్నారు. 100 ఏళ్లల్లో ఆర్ఎస్ఎస్ దేశానికి ఎంతో సేవ చేసిందని ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ అనుపురం లక్ష్మీనారాయణ వివరించారు. మానవ జీవితం సంపూర్ణం కావాలంటే తల్లిదండ్రులను పూజించి ధర్మ రక్షణకు పాటుపడాలని జగన్నాథ్ మఠం పీఠాధిపతి అచ్యుత రామానుజాచార్య స్వామీజీ సూచించారు.

## దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు: ఎమ్మెల్యే

గోల్కొండ: దివ్యాంగులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని తాను సంబంధిత అధికారులను కోరానని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం గ్రేటర్ హైదరాబాద్ దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాహెద్ అలీ ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులు దివ్యాంగుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులో తమకు న్యాయం చేయాలని ఆయన ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ..తాను గతంలోనే సంబంధిత అధికారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపులో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరామన్నారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసి దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని కోరుతానని అవసరమైతే ఈ విషయం అసెంబ్లీలో సైతం లేవనెత్తుతానన్నారు.



జాహెద్ అలీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

### బతుకమ్మ పోటీలు



షీల్డ్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ మిథిలేష్ కుమార్

జియాగూడ: సంస్కృతి సంప్రదాయాలకు బతుకమ్మ వేడుకలు ప్రతీక అని ఇంద్రాణి మహా విద్యాలయ్ కరస్పాండెంట్ ఎం.మిథిలేష్ కుమార్ అన్నారు. ఆదివారం జియాగూడ డబుల్‌బెడ్ రూమ్స్ ప్లే గ్రౌండ్‌లో ఇంద్రాణి మహా విద్యాలయ్ బతుకమ పోటీలను హెచ్ఓడీ ఇంద్రాణి అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో బతుకమ్మ పోటీలు జరిగాయి. గెలుపొందిన మహిళలకు షీల్డ్ బహూకరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎం.దివ్య జ్యోతి, కో ఆర్డినేటర్ ప్రియాంశు శ్రీవాస్తవ, అకాడమి కో ఆర్డినేటర్ సింధుజ, ఇన్‌చార్జి శ్వేతా మీనాక్షి, శిరీష, రిజ్వాన్, రవి, రాధిక, మహేశ్వరీ పాల్గొన్నారు.

### ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావుకు సన్మానం



ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావును సత్కరిస్తున్న డీసీపీ లావణ్య నాయక్ తదితరులు

అబిడ్స్: పోలీసు అధికారులు తాము పనిచేస్తున్న ప్రాంతాల్లో ప్రజల మనసులలో స్థానం సంపాదించి ప్రజల మన్ననలు పొందడమే ఎంతో ప్రాముఖ్యమని ఉమెన్ సేఫ్టీవింగ్ డీసీపీ లావణ్య నాయక్ పేర్కొన్నారు. గోషామహల్‌లోని సౌత్ వెస్ట్‌జోన్ మహిళా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా రెండేళ్లకు పైగా విధులు నిర్వహించి లేక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావుకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ లావణ్య నాయక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావును సత్కరించి అభినందించారు. మహిళా పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సరైన న్యాయం చేస్తూ శ్రీనివాస్‌రావు స్థానికుల మన్ననలు పొందారన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావును మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బంది, డీసీపీ లావణ్య నాయక్, ఏసీపీ ప్రసన్నలక్ష్మీ, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సునిత, షీటీమ్ ఇన్‌స్పెక్టర్ ధనలక్ష్మి, పలువురు మహిళా ఇన్‌స్పెక్టర్లు సత్కరించారు.

## పాతబస్తీలో శాంతియుతంగా ఉత్సవాలు



మాట్లాడుతున్న సయ్యద్ వహీదుద్దీన్ హైదర్ జాఫ్రీ

చార్మినార్: పాతబస్తీలో ఉత్సవాలు మతసామరస్యానికి చిహ్నాలుగా నిలుస్తాయని అంజుమన్-ఇ-అలావీ (అక్బారీ) అధ్యక్షుడు సయ్యద్ వహీదుద్దీన్ హైదర్ జాఫ్రీ అన్నారు. 68 రోజుల పాటు జరిగిన మొహర్రం సంతాప దినాలతో ఇటీవల ముగిసిన మిలాద్-ఉన్-నబీ వేడుకల ముగింపును పురస్కరించుకుని సయ్యద్ వహీదుద్దీన్ హైదర్ జాఫ్రీ ఆధ్వర్యంలో 'థాంక్స్ ఆఫరింగ్ ఫంక్షన్'జరిగింది. ఈ సందర్భంగా సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేయడమే కాకుండా ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..పాతబస్తీలో నిర్వహించే ఏ ఉత్సవాలైనా శాంతియుత వాతావరణంలో కొనసాగుతాయన్నారు. అందరి సహకారాలతో పాతబస్తీలో ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. అంజుమన్-ఇ-అలావీ ఉపాధ్యక్షుడు మీర్ హైదర్ అలీ జాఫ్రీ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి మార్గంలో పయనిస్తేనే ఉజ్వల భవిష్యత్తు

అఫ్జల్‌గంజ్: విద్యార్థులు, యువకులు విద్యార్థి దశ నుంచే శాంతి మార్గంలో పయనిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అంతర్జాతీయ శాంతి దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఏనుగు జంగారెడ్డికి గ్లోబల్ పీస్ అవార్డు-2025 అవార్డు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రతిఒక్కరూ కులమతాలకు అతీతంగా ఐక్యంగా ఉండి శాంతియుత జీవనం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర కో ఆర్డినేటర్లు వేణుగోపాల్, సూర్య శివకుమార్, సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు రాకేష్ గౌడ్, వెంకటేష్, సురేందర్ రెడ్డి, నర్సింహ, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, గ్రంథాలయ మాజీ చైర్మన్ రంగారెడ్డి పాల్గొన్నారు.



ఏనుగు జంగారెడ్డికి అవార్డు అందజేస్తున్న దృశ్యం

## ఉత్సవాలకు దర్బార్ మైసమ్మ ఆలయం ముస్తాబు



ముస్తాబైన దర్బార్ మైసమ్మ ఆలయం

గోల్కొండ: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు కార్వాన్‌లోని దర్బార్ మైసమ్మ ఆలయం ముస్తాబైంది. ఆలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్ టి.అమర్‌సింగ్ ఆధ్వర్యంలో ఆలయంలో ఈ నెల 22 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. 22న బ్రహ్మారాంభిక దేవిగా, 23న బాలాత్రిపుర సుందరిగా, 24న గాయత్రీ దేవిగా, 25న అన్నపూర్ణదేవిగా, 26న మహాలక్ష్మి దేవీగా, 27న రాజరాజేశ్వరి దేవీగా, 28న లలితా త్రిపుర సుందరిగా, 29న సరస్వతీ దేవీగా, 30న దుర్గాదేవిగా, అక్టోబర్ 1న మహిషాసురమర్దినిగా, 2న విజయదశమి రోజున దర్బార్ మైసమ్మ రూపంలో దర్శనం ఇస్తారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కమిటీ చైర్మన్ అమర్‌సింగ్ తెలిపారు.

**కార్వాన్ ధార్మిక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో..**

కార్వాన్ ధార్మిక ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని సమితి అధ్యక్ష, కార్యదర్శులు నాతి మురళీకృష్ణగౌడ్, ఆకుల గోవర్ధన్ తెలిపారు. ఈ ఉత్సవాలను కార్వాన్ చౌరస్తాలోని దర్బార్ మైసమ్మ ఆలయ సమీపంలో ప్రత్యేక మండపం వేసి నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 22న రాత్రి 8 గంటలకు అమ్మవారి ఘటస్థాపనతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాలు వచ్చే 2న విజయదశమితో ముగుస్తాయన్నారు. ఈ నెల 26న రాత్రి 9.15 గంటలకు మాతా వైష్ణవదేవి విశాల జాగరణ ప్రారంభమవుతుందని, 29న మధ్యాహ్నం అన్నప్రసాద కార్యక్రమం, 30న దుర్గాష్టమిని సందర్భంగా శాంతి యజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు.

## అమావాస్య పూజలు.. అన్నదానాలు



పూజల్లో ఆలయ కార్యనిర్వహణ అధికారి వసంత



అన్నదానం చేస్తున్న సంఘం ప్రతినిధులు


గౌలిపురా: ఆర్యవైశ్య సంఘం లాల్‌దర్వాజా-గౌలిపురా, వాసవీ అన్నపూర్ణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం గౌలిపురా బతుకమ్మ బావి వద్ద గల లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో పరమశివునికి ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఛత్రినాక పాత పోలీస్‌స్టేషన్ వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు శ్రీరాం కోటయ్య గుప్తా, ఐపీపీ శ్రీధర మల్లికార్జున్ గుప్తా, ప్రధాన కార్యదర్శి గుబ్బ శ్రీనివాస్‌గుప్తా, కోశాధికారి పడకండి వెంకటేశంగుప్తా, అడ్మిన్ వైస్ ప్రెసిడెంట్ ఇరుకుల భిక్షపతిగుప్తా, ఆర్గనైజింగ్ సెక్రటరీ శేఖర్‌గుప్తా, గ్రీటింగ్స్ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌గుప్తా పాల్గొన్నారు.

**గోల్కొండ కోటలో..**

గోల్కొండ: గోల్కొండ కోటలోని మహంకాళి అమ్మవారికి ఆదివారం అమావాస్య పూజలు జరిగాయి. ఆలయ కార్యనిర్వహణ అధికారి సి.వసంత ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజల్లో ఆలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్ చంటిబాబు, నాగన్న, చంద్రశేఖర్, శ్రీకాంత్, పూజారి బి.సురేష్‌చారి పాల్గొన్నారు.

**బేగంబజార్‌లో..**

అబిడ్స్: మహాలయ అమావాస్యతో ఆదివారం పలు గోశాలలు గో భక్తులతో కిక్కిరిశాయి. బేగంబజార్ గోశాల, ట్యాంక్‌బండ్ గోశాల, జియాగూడ, రహింపురా ప్రాంతాల్లోన్ని గోశాలల్లో గో భక్తులు గో పూజలు నిర్వహించారు. బేగంబజార్ గోశాలలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మనిలాల్ షా గోవులకు గడ్డి తినిపించి పూజలు చేశారు.



గోవులకు గడ్డి తినిపిస్తున్న మనిలాల్‌షా

## నేటి నుంచి లాల్‌దర్వాజా ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిణి మహంకాళి ఆలయంలో సోమవారం నుంచి దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ బి.మారుతి యాదవ్ తెలిపారు. ఆదివారం ఆలయంలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త బ్రహ్మశ్రీ డాక్టర్ కాకునూరి సూర్యనారాయణ మూర్తి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఉత్సవాలకు సంబంధించిన ప్రత్యేక బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు కె.విష్ణు గౌడ్, కె.వెంకటేశ్, ఎ.మాణిక్ ప్రభు గౌడ్, బంగ్లా రాజుయాదవ్, సి.వెంకటేశ్, సి.రాజ్ కుమార్ యాదవ్, కమిటీ ప్రతినిధులు ఎ.చంద్ర కుమార్, ఎ.వినోద్ కుమార్, బి.విఠల్, యశ్వంత్ గౌడ్ పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సూర్యనారాయణ మూర్తి, కమిటీ ప్రతినిధులు

# పాతబస్తీలో తప్పని ట్రాఫిక్ తిప్పలు

చార్మినార్: అసలే ఇరుకు రోడ్లు..ఆపై వీకెండ్‌తో పాటు సెలవులు వస్తే చాలు పాతబస్తీలో వాహనదారులు నరకాన్ని చవి చూడాల్సి వస్తోంది. నయాపుల్ నుంచి గుల్జార్‌హౌజ్ వరకు, దారుషిఫా చౌరస్తా నుంచి బీబీబజార్ చౌరస్తా వరకు, మదీనా నుంచి పురానాపూల్ చౌరస్తా వరకు ట్రాఫిక్ జాం కనిపిస్తుంది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడ వాహనాలతో అడుగుపెట్టిన వారు అంగుళమైనా ముందుకు కదల్లేరు. ఇక నడిరోడ్లను ఆక్రమించి కొనసాగే చిరు వ్యాపారాలతో ప్రతినిత్యం ట్రాఫిక్ జాంలు తప్పడం లేదు. చార్మినార్ ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్లతో పాటు పరిసర ప్రాంతాల రోడ్లలో ప్రతిరోజూ వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రధాన కూడళ్లలో అక్కడక్కడ ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి వచ్చినప్పటికీ..ఇంకా ట్రాఫిక్ సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.



గుల్జార్‌హౌజ్ రోడ్డులో ఎక్కడికక్కడే నిలిచిపోయిన వాహనాలు

**దృష్టి సారించాల్సిన అంశాలు..**

- రోడ్లకిరువైపుల కొనసాగుతున్న ఫుట్‌పాత్ వ్యాపారాలు, ఆక్రమణలను నియంత్రించాలి.
- రోడ్లను ఆక్రమించి అమ్మకాలు జరుపుతున్న వారిని కట్టడి చేయాలి.
- పాతబస్తీలో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చోట సిబ్బంది సంఖ్యని పెంచాలి. అలాగే ఆర్టీసీ, పోలీస్, ట్రాఫిక్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో పని చేస్తే ఆశించిన ఫలితాలుంటాయని పాతబస్తీ వాహనదారులు అంటున్నారు.
- చార్మినార్ ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్లలో అవసరమైన చోట రోడ్ల విస్తరణ జరగాల్సిన అవసరం ఉంది.
- ఇప్పటికే విస్తరించిన రోడ్ల కూడళ్లలో ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలి.
- అధ్వాన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయాలి.
- రోడ్లపై విచ్చలవిడి పార్కింగ్‌లను నిషేధించి ఫుట్‌పాత్‌లు, రోడ్లపైనే అక్రమ వ్యాపారాలు కొనసాగిస్తున్న వారిని వెంటనే తొలగించాలి.

## అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



డబీర్‌పురా కోమటివాడిలో బతుకమ్మ సంబరాల్లో మహిళలు



జ్ఞాన భారతి మోడల్ హైస్కూల్ ప్రాంగణంలో..



ఆంధ్ర విద్యాలయలో..

బతుకమ్మ సంబరాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మ సందర్భంగా మహిళలు రంగు రంగుల పువ్వులతో అందంగా బతుకమ్మను పేర్చి ఆడిపాడి సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను కొలనులలో నిమజ్జనం చేసి ఫలహారాలను పంచిపెట్టారు.

– చార్మినార్, అబిడ్స్, మెహిదీపట్నం జోన్ల బృందం



రవీంద్రభారతిలో..





లంగర్‌హౌజ్ టిప్పుఖాన్ బ్రిడ్జి సమీపంలోని మధుపార్క్ రిడ్జ్ అపార్టుమెంటులో..